## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్, నవంబర్ 22: 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు బీబీఆర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని ఫిరోజ్‌గూడ, కోయబస్తీ, ప్రభుత్వ పాఠశాల, పోచమ్మ ఆలయం, అంతమ్మగూడ, ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం. అదేవిధంగా 11.30 నుంచి 12 గంటల వరకు గణేశ్‌నగర్ ఫీడర్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. అదేవిధంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాంరాజ్‌నగర్ ఫీడర్ పరిధిలోని రాంరాజ్‌నగర్, ఎండీఎఫ్ రోడ్డు, శంకర్ ఎన్‌క్లేవ్, సమతా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండీఎఫ్ ఫీడర్ పరిధిలోని మానససరోవరం ఫేజ్-1,2,3, ఎల్బీనగర్, గంగపుత్ర సంఘం, భవానీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుంది. వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన సూచించారు.

- మియాపూర్: 11 కేవీ ఫేజ్-2 ఫీడర్ పరిధిలో అడ్డగుట్ట వాటర్ ట్యాంక్ ఏరియా, శాతవాహన కాలనీ రోడ్డు ప్రాంతంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు భాగ్యనగర్ సెక్షన్ ఏఈ షాబాజ్ తెలిపారు.
- జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11నుంచి సాయంత్రం వరకు శ్రీనివాసనగర్, లెనిన్‌నగర్, రింగుబస్తీ పరిసర ప్రాంతాల్లో విదుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### డీసీపీ, ఏసీపీలను ఆదేశించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుండిగల్, నవంబర్ 22: ప్రభుత్వ భూ ఆక్రమణలపై వార్త కథనాలు రాసిన జర్నలిస్టు మద్దయ్యపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డీసీపీ, ఏసీపీలను ఆదేశించారు. జర్నలిస్టుపై జరిగిన దాడి విషయం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్, దాడికి గురైన జర్నలిస్టు మద్దయ్య, మాల మహానాడు నేత బొట్టు నర్సింగ్‌రావు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు సమాచారాన్ని ఫోన్‌లో వివరించారు. వెంటనే స్పందించిన ఆయన పేట్‌బషీరాబాద్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డికు ఫోన్ చేసి సంఘటనపై ఆరా తీసి నిందితులపై బీఎన్ఎస్, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టం కింద కేసు నమోదు చేసినందున విచారణను త్వరగా పూర్తి చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

మియాపూర్, నవంబర్ 22 : గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి (70)చెందిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీఎస్ఎం మాల్ ఎదుట మంజునాథ వైన్స్ సమీపంలో గురువారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తిని జీఎస్ఎం మాల్ సెక్యూరిటీ సిబ్బంది అంబులెన్స్‌లో గాంధీ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## యువకుడు అదృశ్యం



వెంకటేశ్ (ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22: యువకుడు అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం, మాదాపూర్ గ్రామానికి చెందిన చేకొండ వెంకటేశ్(26) కొన్ని రోజులుగా నిజాంపేటలోని ఓ కళాశాల హాస్టల్ క్యాంటీన్‌లో పనిచేస్తున్నాడు. గత నెల 30న అతడిని కళాశాల హాస్టల్ క్యాంటీన్ పనినుంచి తొలగించారు. దీపావళి పండుగకు ఇంటికి వస్తున్నానని తల్లికి సమాచారం ఇచ్చిన వెంకటేశ్ తాను పనిచేస్తున్న హాస్టల్ క్యాంటీన్ నుంచి బయలుదేరి వెళ్లాడు. కానీ...అతడు ఇంత వరకు ఇంటికి చేరుకోలేదు. ఫోన్ చేసిన స్పందిండం లేదు. తాను పనిచేసిన కళాశాలలో, బంధుమిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో తన కుమారుడు కనిపించడం లేదని తల్లి జానకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



మూసాపేట ఇందిరానగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, తదితరులు

మూసాపేట, నవంబర్22: దశాబ్దాలుగా బస్తీ, కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే దక్కుతుందని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. మూసాపేట పరిధి ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులను జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, వర్షిణి, తుకారాం, రాజు, నర్సింహ, ప్రభాకర్, మంగమ్మ, బాలరాజు, యాదిలాల్, కృష్ణ, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు కార్పొరేటర్ అన్న వితరణ



కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి గ్రామంలోని పాత శివాలయంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు కార్పొరేటర్ దంపతులు అన్న వితరణ చేపట్టారు. - మియాపూర్, నవంబర్ 22

## ర్యాగింగ్‌కు పాల్పడి.. భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు..



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన ర్యాలీలో ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22: విద్యార్థులు సరదా కోసం ర్యాగింగ్‌కు పాల్పడి.. భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ ర్యాలీని ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ కళాశాలలో ర్యాగింగ్ చర్యలను నిషేధించడం జరిగిందని, విద్యార్థులు స్వల్పకాలిక సరదాకోసం.. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయడం సరికాదన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు కలసిమెలసి చదువుకోవాలని, ర్యాగింగ్‌తో బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్ రహిత క్యాంపస్ తీర్చిదిద్దేందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వి.పార్వతి, పీఆర్ఓ ప్రసన్న, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



గౌతంనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

## కుంగిపోయిన మ్యాన్‌హోళ్లను సరి చేయండి

బాలానగర్, నవంబర్ 22: గౌతంనగర్‌లో కుంగిపోయిన మ్యాన్‌హోళ్లను సరి చేయాలని జలమండలి అధికారులకు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని గౌతంనగర్‌లో పర్యటించి.. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌతంనగర్‌లో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కుంగిపోయిన మ్యాన్‌హోళ్లను తక్షణమే సరి చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. తరచూ శానిటేషన్ సమస్యలు తలెత్తుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జలమండలి అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, రమానంద్, జగన్, పాండు నాయక్, బాగయ్య, ఆనంద్‌గౌడ్, సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినాయక్‌నగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

## వీడీసీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

బాలానగర్, నవంబర్ 22: వీడీసీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు కచ్చితంగా పాటించాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపునీరు నిలవకుండా లెవలింగ్ పాటిస్తూ రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. కాలనీవాసుల సమస్యలను పరిగణలోకి తీసుకొని వీడీసీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సునీల్, రాములు, సిద్దిరాములు, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దండముడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

కుత్బుల్లాపూర్, నవంబర్ 22: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతూ వారి సంక్షేమానికి బాటలు వేసేందుకు నిరంతరం తాను ముందుండి పని చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ దండముడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మౌలిక సదుపాయల కల్పనకు కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ప్రజలు

దుండిగల్, నవంబర్ 22: బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా వివిధ శుభకార్యాలకు, అయ్యప్ప స్వామి మహాపడి పూజలకు హాజరు కావాలని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

## జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ.. స్విమ్మింగ్ మెన్ అండ్ ఉమెన్ జట్ల ఎంపిక



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ స్విమ్మింగ్ మెన్ అండ్ ఉమెన్ జట్లతో పాటుగా.. టేబుల్ టెన్నిస్ మెన్ జట్లను ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.అశోక్ తెలిపారు. శుక్రవారం వర్సిటీ పరిధిలోని క్రీడాకారులతో ఎంపిక పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. స్విమ్మింగ్ క్రీడాకారులు చెన్నైలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. - కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22

## ఎన్ఎస్‌కేకే హై స్కూల్‌లో ప్రారంభమైన సైన్స్ ఎగ్జిబిషన్



జ్యోతిప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ విజయకుమారి, తదితరులు

దుండిగల్, నవంబర్ 22: విద్యార్థులు నిరంతరం సృజనాత్మకంగా ఆలోచించి సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) విజయకుమారి తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గాగిళ్లాపూర్‌లోని ఎన్ఎస్‌కేకే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మేడ్చల్ జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్ట్ కాంపిటీషన్-2024ను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి దాదాపు 280 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 24 మందికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి 8మందిని ఎంపిక చేసి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి నుంచి 10శాతం మంది విద్యార్థులను అంటే 17మందిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి కే.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్‌రాజు, స్థానిక మండల విద్యాధికారి కృష్ణ, ఎమ్మెల్వో రమేశ్, ఎన్ఎస్‌కేకే స్కూల్ చైర్మన్ ఎన్ఎం థామస్, సెక్రటరీ బాబు, ప్రిన్సిపాల్ సుమాదేవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచారి, రోయన్న, శారదతో పాటు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ సేవలో యువత ముందుండాలి




కొంపల్లి సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాయు వింగ్ కమాండర్ గురుప్రీతి, కళాశాల డైరెక్టర్ నరిశెట్టి సుందరరాజు

కుత్బుల్లాపూర్, నవంబర్ 22: దేశ రక్షణ కోసం భద్రత రంగంలో యువత రాణించేందుకు ముందుండాలని భారతదేశ వాయువింగ్ కమాండర్ గురుప్రీతి పిలుపునిచ్చారు. శుక్రవారం కొంపల్లిలో సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు దేశ రక్షణలో ముఖ్య భూమికను పోషిస్తున్న రక్షణ దళాలైన వాయుసేనలో చేరేందుకు కావాల్సిన అర్హతలు, ఇతర నైపుణ్యాలు వంటి పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారి సీహెచ్.ప్రభాకర్, వాయువింగ్ సేనా కమాండర్ సందీప్, ప్రొఫెసర్ ఫాదర్ విన్సంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హిందూ శ్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సబీహాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

## హిందూ శ్మశాన వాటికలో.. సమస్యలు పరిష్కరించాలి

అల్లాపూర్, నవంబర్ 22: అల్లాపూర్ డివిజన్ పరిధి రామారావునగర్ హిందూ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని శ్మశాన వాటిక కమిటీ సభ్యులు శుక్రవారం కార్పొరేటర్ సబీహాబేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో రెండు కొత్త దహన వాటికలు నిర్మించాలని, స్ట్రీట్ లైట్లు, పార్కింగ్ టైల్స్, వాచ్‌మన్ రూమ్, ఆఫీస్ రూమ్, కాంపౌండ్ వాలు ఎత్తు పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ శ్మశాన వాటిక సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ వీరరెడ్డి, నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, నరసింహ మాస్టార్, రామ్‌రెడ్డి, యోగిరాజ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కల్చరల్ విభాగం హెచ్‌ఓడీ ఎస్.కాంతరెడ్డి ఏర్పాటు చేసిన డ్రాయింగ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమయింది. ఈ ప్రదర్శన ఈనెల 23వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇందులో 42 పెయింటింగ్స్‌ను సందర్శనకు ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. - కొండాపూర్, నవంబర్ 22




గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్లలోని సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాలను రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. - శేరిలింగంపల్లి, నవంబర్ 22

## కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర



మియాపూర్, నవంబర్ 22: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్-1,2లో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ, అంతర్గత రహదారులు, తాగునీటి సమస్యలను కార్పొరేటర్‌కు విన్నవించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, మహదేవ్, కాలనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో అధ్యాపకులకు, విద్యార్థులకు సూచనలు చేస్తున్న జయకృష్ణ

## సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22: సమాజంలోని ప్రతి ఒక్కరూ సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలని సెక్యూరిటీ కన్సల్టెంట్ జయకృష్ణ అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూయర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ఇండస్ట్రీ నిపుణులతో బ్లూ టీం సైబర్ సెక్యూరిటీ అన్న అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంటర్ సాఫ్ట్ సొల్యూషన్స్ సెక్యూరిటీ కన్సల్టెంట్ జయకృష్ణ మాట్లాడుతూ.. బలమైన, యూనిక్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని, నకిలీ ఈమెయిల్స్, లింక్స్‌ను క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయడంలో జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 62 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చేయూత అభినందనీయం



జగద్గిరిగుట్ట, నవంబర్ 22: పేద విద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు తెలిపారు. జగద్గిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30మందికి పదోతరగతి పరీక్ష ఫీజును పేబ్యాక్ సొసైటీ, అంబేద్కర్ సేవా సమితి సభ్యులు శుక్రవారం అందజేశారు. హెడ్మాస్టర్ సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి, వీరయ్య, పరశురాం, నవీన్‌కుమార్, మల్లేశ్, కుమార్ పాల్గొన్నారు.

## ఐటీఎఫ్-ఎంటీ700 టోర్నమెంట్‌లో.. రన్నరప్‌గా వెంకటనారాయణమూర్తి జోడీ



రన్నరప్ ట్రోఫీతో వెంకటనారాయణమూర్తి, హన్స్‌గార్డ్ పాసోల జోడీ

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22: థాయ్‌లాండ్ పట్టాయ నగరంలో రాయల్ క్లీఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్(మాస్టర్ టూర్ 700) టోర్నమెంట్‌లో.. 50 ప్లస్ విభాగం డబుల్స్ ఫైనల్స్ పోటీల్లో వెంకటనారాయణమూర్తి(ఇండియా-హైదరాబాద్, కేపీహెచ్‌బీ కాలనీ), హన్స్‌గార్డ్ పాసో(జర్మనీ) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు సాగిన ఈ టోర్నమెంట్‌లో వెంకటనారాయణమూర్తి(ఇండియా), హన్స్‌గార్డ్ పాసో(జర్మని) జోడీ స్టీఫెన్ బెయిలీ(ఐర్లాండ్), జెఫ్ క్లారిడ్జ(ఇంగ్లాండ్)ల జోడీలు ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం జరిగిన ఫైనల్ పోటీలో ఇరు జట్లు హోరాహోరీగా పోరాడగా.. చివరకు వెంకటనారాయణమూర్తి జోడీ రన్నరప్‌గా నిలిచింది.